

హైదరాబాద్ వార్త

# జయహో తెలంగాణ



**-భాగ్యనగరంలో ఘనంగా దశాబ్ది ఉత్సవాలు**

**-ట్యాంక్‌బండ్‌పై వర్షంలోనే కలర్‌ఫుల్ వేడుకలు**

**-హాజరైన గవర్నర్, సిఎం, మంత్రులు**





**హైదరాబాద్, జూన్ 2 ప్రభాతవార్త**

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ధి ఉత్సవాలు ఆదివారం నగరంలో కన్నుల పండువగా జరిగాయి. ప్రత్యేక తెంగాణ పదేళ్ల సంబరాలు అంబరమంటేలా భాగ్యనగరంలో నిర్వహించారు.ఆదివారం ఉదయం పరేడ్‌గ్రౌండ్స్ లో,సాయంత్రం ట్యాంక్‌బండ్‌పై వర్షాలోనే సంబరాలకు కొనసాగాయి. అత్యంత వైభవంగా జరిగే ఈ వేడుకల్లో రాష్ట్ర అధికార గీతాన్ని ప్రభుత్వం ఆవిష్కరించింది.ఉదయం గన్ పార్కులో అమరవీరుల స్థూపం వద్ద మంత్రులతో కలిసి వెళ్లిన సిఎం రేవంత్‌రెడ్డి నివాళులు అర్పించారు. అనంతరం సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో జాతీయ జెండా ఆవిష్కరిస్తారు. అక్కడ కనువిందుగా సాగిన పోలీసు బలగాల పరేడ్, మార్చ్ పాస్ట్ జరిగింది.ఈ సందర్భంగా విశిష్ట సేవలు అందించిన పోలీసు సిబ్బందికి,ఉత్తమ కాంటింజెంట్లకు అవార్డులను ప్రధానం చేశారు. అనంతరం ఈ వేదికపై సిఎం రేవంత్‌రెడ్డి "జయ జయహే తెలంగాణ" రాష్ట్ర అధికార గీతాన్ని జాతికి అంకితం చేశారు. ఈ పాటను అందెశ్రీ రచించగా..కీరవాణి సంగీతం అందించారు. పాట విడుదల సందర్భంగా రచయిత అందెశ్రీ భావోద్వేగానికి గురయ్యారు. సాయంత్రం ట్యాంక్‌బండ్‌పై ఆవిర్భావ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. గవర్నర్ రాధాకృష్ణన్, సిఎం రేవంత్‌రెడ్డి ,డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క ,ప్రొఫెసర్ కొందడరాం,మంత్రులు,ప్రజాప్రతినిధులు పాల్గొని వర్షంలో తడిసి ముద్ధయి కలర్‌ఫుల్ వేడుకలను అహ్లాదకరంగా ఆస్వాదించారు.ఉత్సవాల్లో భాగంగా కళాకారులతో తెలంగాణ కళారూపాల కార్నివాల్ నిర్వహించారు. అనంతరం శాస్త్రీయ, సాంస్కృతిక, నృత్య ప్రదర్శనలు ఆహ్లాదంగా సాగాయి. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని చాటేవిధంగా పలుచోట్ల సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. 5వేల మంది జాతీయ జెండాలతో ట్యాంక్‌బండ్‌పై భారీ ఫ్లాగ్‌వాక్ నిర్వహించారు. ఫ్లాగ్ వాక్ జరుగుతుండగా 13.30 నిమిషాల ఫుల్ వర్షన్ రాష్ట్ర గేయం "జయ జయహే తెలంగాణ'ను విడుదల చేశారు.ఈ సందర్భంగా గీత రచయిత, కవి అందెశ్రీ, ప్రముఖ సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణిలను సన్మానించారు. రాత్రి హుస్సేన్ సాగరం మీదుగా ఆకాశంలో రంగులు విరజిమ్మేలా బాణాసంచా కార్యక్రమం అందర్ని ఆకట్టుకున్నాయి. కాగా, గన్‌ఫౌండ్రి అమరుల స్థూపం వద్ద తెలంగాణ అమరుల కు పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. మరోవైపు అన్ని ప్రభుత్వ కార్యాలయాలను అందంగా అలంకరించారు. రంగు రంగుల విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు.





## తప్పతాగి యువకుల వీరంగం

**ఉప్పల్, జూన్ 2 ప్రభాతవార్త :**

తప్పతాగి ఉప్పల్‌లోని ఒక టిపిన్ సెంటర్ వద్ద అర్థరాత్రి నడిరోడ్డుపై గొడవ పడి ఒక యువకుడిపై హత్యయత్నం చేసిన ఐదుగురు యువకులను ఉప్పల్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సిఐ ఎలక్షన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నాగోల్‌కు చెందిన పి.ఆదిత్య 24, అతని స్నిహితులైన నాచారంకు చెందిన సామిక్ 20, నాగోల్‌కు చెందిన వంశీలతో కలిసి రాత్రి వరకు వివిధ ప్రాంతాల్లో తిరిగి టిఫిన్ చేసేందుకు ఉప్పల్‌లోని ఒక బిర్యానీ హోటల్ వద్దకు వచ్చారు. బిర్యానీ హోటల్ పక్కనే ఉన్న ఒక టిపిన్ సెంటర్‌లో టిపిన్ చేసి చేతులు కడుకునే సమయంలో అక్కడే ఉన్న ఉప్పల్ విజయపురికాలనీకి చెందిన తాడెం సాయికిరణ్ అలియాస్ మిల్లుసాయిపై నీరు పడడంతో గొడవ పడ్డారు. దీంతో సాయికిరణ్ అతని స్నేహితులు శాంతినగర్‌కు చెందిన కొమ్ము ప్రశాంత్ అలియాస్ చిన్న హనుమసాయినగర్‌కు చెందిన లంక నవీన్, ఇందిరానగర్‌కు చెందిన హన్మకొండ భరత్ అలియాస్ బబ్లూ కలిసి మద్యం మత్తులో గొడవకు దిగారు.దీంతో వివాదం పెద్దది కావడంతో సాయి కిరణ్ అక్కడే ఉన్న కూల్ డ్రింక్స్ బాటిల్‌తో ఆదిత్యను మూడు చోట్ల పొడిచినట్లు తెలిపారు. అతనికి తీవ్ర గాయాలు కావడంతో వెంటనే స్థానికులు ఆసుపత్రికి తరలిం చారు. మద్యం మత్తులో యువకులు నడిరోడ్డుపై వీరంగం సృష్టించడంతో స్థానికంగా కలకలం రేగింది. ఈ మేరకు ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

**టిపిన్ సెంటర్ యజమాని అరెస్ట్ :**

అర్థరాత్రి వరకు టిఫిన్ సెంటర్ తెరిచి గొడవకు కారణమైన బిరాడ దిగంబర్‌ను ఉప్పల్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. రాత్రి వరకు టిఫిన్ సెంటర్ నడుపుతూ నేరం జరిగేందుకు కారణం అయ్యాయని, నేరం జరిగినట్లు రుజువు కావడంతో జైభవానీ టిపిన్ సెంబర్ యజమానికి బిరాడ దిగంబర్‌ను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. అర్థరాత్రి వరకు దుకాణాలు తెరిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సిఐ ఎలక్షన్‌రెడ్డి తెలిపారు.

## పార్క్‌లైన్ చౌరస్తాలో కుప్ప కూలిన చెట్టు

**-కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం.**

**-తొలగించిన ట్రాఫిక్ పోలీసులు, డిఆర్‌ఎఫ్ సిబ్బంది**



పార్క్‌లైన్ చౌరస్తాలో కుప్పకూలిన చెట్టు.

**బేగంపేట జూన్ 2,ప్రభాతవార్త**

రాంగోపాల్‌పేట డివిజన్ పరిధిలోని పార్క్‌లైన్ చౌరస్తాలో ఆదివారం మధ్యాహ్నం ఉన్నట్లుండి రోడ్డు పక్కనే ఉన్న ఓ చెట్టు రోడ్డుపై కుప్పకూలిపోయింది.ఈ ఘటనతో ఫుట్‌పాత్ పక్కనే వ్యాపారాలు నిర్వహించుకునే చిరు వ్యాపారులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు.దీంతో ఆ మార్గంలో వాహనాలు వెళ్లే మార్గం మూసుకు పోయింది.ఇదే సమయంలో చెట్టు కొమ్మలు తగిలి ఒక వీధిలైటు స్తంభం కూడా మరో పక్కకు ఒరిగిపోయింది.దీంతో అక్కడి వరకు వచ్చిన వాహనదారులు వెళ్లే మార్గం లేక వెనుదిరిగి వెళ్లి చుట్టు తిరిగి వెళ్లాల్సి వచ్చింది.చెట్టు కూలిన విషయం తెల్సుకున్న బేగంపేట ట్రాఫిక్ అడిషినల్ డీసీపీ ఎస్.రంగారావు మహంకాళీ ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ ఉపాశంకర్‌ను అప్రమత్తం చేయడంతో వెంటనే అక్కడికి చేరుకుని ట్రాఫిక్ క్రేన్ సహాయంతో చెట్టు తొలగించేందుకు ప్రయత్నించారు.భారీ చెట్టు కావడంతో వెంటనే డీఆర్‌ఎఫ్ సిబ్బందిని రంగంలోకి దింపి చెట్టు కొమ్మలను కట్‌చేసారు.పడిపోయిన చెట్టు కొమ్మలను,తొలగించిన సుమారు 45నిమిషాల తర్వాత ఆ మార్గంలో ట్రాఫిక్ యధావిధిగా కొనసాగింది.సకాలంలో స్పందించిన అధికారులకు వాహనదారులు కృతజ్ఞతలు తెలియజేసారు.

## నగరంలో ఈదురుగాలులతో భారీ వర్షం



**హైదరాబాద్, జూన్ 2 ప్రభాతవార్త**

నగరంలో వాతావరణం ఒక్కసారిగా మారింది. ఆదివారం పలుచోట్ల ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వాన పడింది. మల్కాజ్‌గిరి, నేరేడ్‌మెట్, ఉప్పల్, రామంతాపూర్, చిలుకానగర్, మేడిపల్లి, బోడుప్పల్, ఫీర్జాదిగూడ, సికింద్రాబాద్, ట్యాంక్‌బండ్, దోమలగూడ, హిమాయత్‌నగర్ తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. వర్షపు నీరు రోడ్లపై నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వనస్థలిపురం, ఎల్బీనగర్, హయత్‌నగర్, పెద్ద అంబర్‌పేట, అబ్దుల్లాపూర్‌మెట్, నాగోల్, కొత్తపేట, కర్మన్‌ఘాట్, చంపాపేట్, మలక్‌పేట, తార్నాక, ఓయూ,అంబర్‌పేట, బంజారాహిల్స్‌లో వర్షం పడింది. వనస్థలిపురంలో గాలి వాన బీభత్సం సృష్టించింది. జిహెచ్‌ఎంసి సిబ్బంది చేరుకుని రహదారిపై పడిన చెట్లను తొల గించారు. భారీ ఈదురుగాలులతో విద్యుత్ సరఫరాకు అంతరాయమేర్పడింది.కాగా, వచ్చే మూడు రోజులు వర్షాలు ఉన్నాయని వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఈ క్రమంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిహెచ్‌ఎంసి అధికారులు కూడా సూచనలు జారీ చేశారు.

## పరేడ్ మైదానం వద్ద పదనిసలు....

**బేగంపేట జూన్ 2,ప్రభాతవార్త**

తెలంగాణా రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించింది.ఈ వేడుకలలో పాల్గొనేందుకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి 270 బస్సులలో కాంగ్రెస్ శ్రేణులు,ప్రజలు పరేడ్ మైదానానికి తరలి వచ్చారు.పరేడ్ మైదానంలో తెలంగాణా రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని అట్టహాసంగా నిర్వహించారు.వివిధ శాఖల సమన్వయంతో పరేడ్ మైదానం పరిసరాల్లో భారీ ఏర్పాట్లు చేసారు.ద్విచక్ర వాహనాలపై వచ్చిన వారు మాత్రం తమ వాహనాలను సుదూరంలో పార్కింగ్ చేసుకుని రోడ్డు దాటి పరేడ్ మైదానంలోకి వెళ్లారు.పరేడ్ మైదానంలో నిర్వహించిన వేడుకలకు హాజరయ్యేందుకు ప్యారడైజ్,పరేడ్ గ్రౌండ్స్ మెట్రో స్టేషన్లు అనువుగా ఉండటంతో కొంతమంది మెట్రో రైలు ద్వారా పరేడ్ మైదానానికి చేరుకున్నారు.దీంతో ప్యారడైజ్,పరేడ్ మైదానం మెట్రో స్టేషన్లు రద్దీగా మారాయి.పరేడ్ మైదానం చుట్టూ ఉన్న ఖాళీ స్థలాల్లో వాహనాల పార్కింగ్ సౌకర్యం కల్పించడంతో అక్కడ దిగిన శ్రేణులు నడుచుకుంటూ పరేడ్‌మైదానంలోకి చేరుకున్నారు.వేడుకలకు హాజరైన ప్రజలకు జలమండలి ఆధ్వర్యంలో తాగునీటిని అందించారు.పెద్ద సంఖ్యలో నీటి బాటిల్స్‌ను పంపిణీ చేసారు. గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ప్రతి కుర్చీకి తాగునీటి బాటిల్‌ను అందించారు.అందరి చేతుల్లోనూ నీటి బాటిల్స్ కనిపించాయి.మజ్జిగ,లస్సీ,ఓఆర్‌ఎస్‌లను కూడా వేడుకలకు వచ్చిన వారికి అందజేసారు.ఈ వేడుకల సందర్భంగా టివోలి జంక్షన్,సీటీఓ,సంగీత్ జంక్షన్లను మూసివేయడంతో వాహనదారులు కొంత ఇబ్బంది పడ్డారు.గడచిన రెండు రోజులుగా ట్రాఫిక్ పోలీసులు ఈ విషయంపై అవగాహన కల్పించినా కొందరు వాహనదారులు ఆప్రాంతాలకు చేరుకుని ఆ తర్వాత వేరే వైపు మరలి వెళ్లారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉదయం గం 9.45నిలకు పరేడ్ మైదానానికి చేరుకుని గం 11.45నిలకు వెళ్లిపోయారు.ముఖ్యమంత్రి వెళ్లే వరకు ట్రాఫిక్‌ను నిలిపివేసారు.దీంతో కొంత సేపు ట్రాఫిక్ కు అంతరాయం ఏర్పడింది.తెలంగాణా రాష్ట్ర గీతం జయ జయహే ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా విడుదల చేసారు.ఈ సందర్భంగా ఆ పాటను రాసిన అందెశ్రీ భావోద్వేగానికి లోనయ్యారు.ఎండ తీవ్రతకు కొందరు మహిళలు ఫుట్‌ఫాత్‌ల మీద నీడపట్టున సేదతీరారు.

# కౌంట్‌డౌన్

**-రేపు ఓట్ల లెక్కింపు**

**-ఎలక్షన్ రిజల్ట్ సందర్భంగా 144 సెక్షన్**

**-కౌంటింగ్ కేంద్రాల వద్ద భద్రత కట్టుదిట్టం**

**-లిక్కర్‌కి అడ్డుకట్ట**




**హైదరాబాద్, జూన్ 02, ప్రభాతవార్త:**

జరిగిన సార్వత్రిక ఎన్నికల ఫలితాలు విడుదలవుతున్న సందర్భంగా శాంతి భద్రతల కొరకు పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోనున్నారు. అందులో భాగంగా ఈ నెల 4వ తేదీన నగర పరిధిలో వివిధ ప్రాంతాలలోని కౌంటింగ్ సెంటర్ల వద్ద 144 సెక్షన్ అమలుపరుస్తున్నట్లు రాచకొండ కమీషనర్ తరుణ్ జోషీ ప్రకటించారు. కౌంటింగ్ రోజు నగర వ్యాప్తంగా భారీ ఎత్తున పోలీసు అధికారులు, హోం గార్డులతో పాటు మిలట్రీ, పారా మిలట్రీ దళాలు డ్యూటీలో ఉండనున్నట్లు స్పష్టం చేశారు. ఓట్ల కౌంటింగ్, ఫలితాల విడుదల ప్రక్రియలకు గానూ 4, 5 తేదీలలో కట్టుదిట్టమైన ఆంక్షలు, భద్రతా చర్యలు అమలలులో ఉంటాయని తెలుపుతూ, ఈ మేరకు ఆదివారం అధికారిక ఉత్తరువు విడుదల చేశారు. దాంతో నగరంలో పోలీసు బృందాలు అప్రమత్తమయ్యాయి. కౌంటింగ్ జరిగే రోజు రాచకొండ కమీషనరేట్ పరిధిలోని ఓట్ల కౌంటింగ్ సెంటర్లకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆంక్షలలో భాగంగా కౌంటింగ్ కేంద్రాలకు 500 మీటర్ల వరకూ గుంపులుగా జనాలు తిరగకుండా, ఎటువంటి అసాంఘిక చర్యలకూ, అల్లర్లకూ పాల్పడకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కౌంటింగ్ కేంద్రాలకు 1 కిలోమీటర్ దూరంలో పెద్ద ఎత్తున జనంతో సభలు, సమావేశాలు నిర్వహించడం కానీ, రెచ్చగొట్టే విధంగా ప్రచారం చేయడం గాని చేయకుండా పలువురు నేతల మీద, అల్లర్లు జరిపే వ్యక్తుల మీద ముందుగానే నిఘా వేసినట్లు చెప్పారు. ఎక్కడా కూడా షామియానాలు, టెంట్లు కనబడకుండా చేయమని పోలీసు బృందాలను ఆదేశించినట్లు పేర్కొన్నారు. కౌంటింగ్ కేంద్రాల చుట్టు ప్రక్కల ఐదుగురు కంటే ఎక్కువ మంది గనుక ఉన్నా, టమాటాల వంటి కూరగాయలు, విసరడానికి కోడిగుడ్లు, కర్రలు, జెండాలు, లాఠీలు, తుపాకులు, కత్తులు, ఖడ్గాలు, ఇనప రాడ్లు, కంకర రాళ్ళు, ఇటుకలు, బాంబులు, యాసిడ్ బాటిళ్ళు, పెప్పర్ స్ప్రేలు తదితర మారణాయుధాలు ఎవరి దగ్గరైనా ఉన్నా, వారిని తక్షణమే అరెస్ట్ చేస్తామన్నారు. అంతే కాకుండా ఫలితాల రోజు నగరంలోని లిక్కర్ షాపులు, స్టార్ హోటళ్ళు, బార్ ఎండ్ రెస్టారెంట్లు, క్లబ్బులు తదితర మద్య విక్రయ శాలలను మూసి వేస్తున్నట్లు కమీషనర్ తెలిపారు. లిక్కర్ లైసెన్స్ కలిగి ఉన్న వివిధ హోటల్ వ్యాపారులకు కూడా కౌంటింగ్ రెండు రోజులు మద్యం విక్రయాలకు అనుమతి లేదని తెలిపారు. ఎన్నికల ఫలితాలు విడుదలయిన అనంతరం, అల్లర్లను అడ్డుకునే నేపథ్యంలో రాజకీయ నాయకుల కటౌట్లకు, ఫోటోలకూ పాలాభిషేకాలు చేయకుండా, కుల మతాలపై ప్రభావితం చేసే వివిధ సింబళ్ళతో, నినాదాలతో ప్లకార్డుల ఊరేగింపులు జరగకుండా కట్టుదిట్టమైన నియమం విధించారు. దానితో పాటు డీజే పాటలను, రాజకీయ పాటలను ప్లే చేసే సౌండ్ సిస్టమ్‌లు, మైకులు ఎక్కడా కనబడకుండా, అరుపులు, కేరింతలతో జనాల కోలాహలాలు జరక్కుండా జాగ్రత్తలు తీసుకోనున్నట్లు తెలిపారు. అందులో భాగంగా టపాసులను కూడా నిషేదించారు. ఏ పార్టీ అభిమానులు గానీ, కార్య కర్తలు గానీ రోడ్ల మీద, జనసంచారం ఉన్న చోట ఎటువంటి పేలుడు పదార్థాలు పేల్చడం గానీ, ప్రజలపై టపాసులు విసరడం గానీ చేయకుండా పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. నియమ నిభందనలు అమలు పరిచే విషయంలో అందరూ పోలీసులకు సహకరించాలన్నారు. ప్రజల శాంతి భద్రతలకు ఎవరడ్డొచ్చినా వారిని దండించే విధంగా చర్యలు చేపట్టారు. ఆంక్షలు ఉల్లంఘించిన వారిని తక్షణమే అదుపులోకి తీసుకుని శిక్షిస్తామని హెచ్చరించారు.

**ఫలితాలపై అభ్యర్థుల తర్జనభర్జన..!**

ఎగ్జిట్‌పోల్స్ సర్వేల్లో కమలం-హస్తం పార్టీల మధ్య ప్రధాన పోటీ నెలకొందని వెల్లడవుతున్నాయి.దీంతో కౌంటింగ్ మరికొన్ని గంటల్లో ఉండగా అభ్యర్థులు లెక్కల్లో బిజిబిజీ అయ్యారు. అనుచరులు, ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలతో రోజంతా చర్చిస్తున్నారు. లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని అసెంబ్లీ సెగ్మెంట్లో ఎక్కడ లీడ్ వస్తుంది? ఎక్కడ చేజారిపోతుంది? అనే అంశాలపై సుదీర్ఘంగా చర్చిస్తున్నారు. గెలుపుపై నాయకులు, కార్యకర్తలు చెబుతున్న మాటలతో అభ్యర్థులు కొంత ఊరట పొందుతున్నారు. ఇదే సమయంలో ఫలానా చోట మనకు తక్కువే వస్తాయి కావచ్చు..అనే అనుమానాలు వ్యక్తం చేస్తుండడంతో మరికొంత గుబులు చెందుతున్నారు. గెలుపుపై కొంత మందికి వంద శాతం నమ్మకం ఉన్నప్పటికీ..ఈవీఎంలలో ఎలా ఉంటుందోనని హడలిపోతున్నారు.

**రంగంలోకి బెట్టింగ్ రాయుళ్లు..**

ఎన్నికల ఫలితాలు మరికొన్ని గంటల్లో వెలువడనున్న నేపథ్యంలో బెట్టింగ్ రాయుళ్ల రంగంలోకి దిగారు. శివారు ప్రాంతాల్లోని ఫాం హౌస్‌లు, రిసార్ట్‌లలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉదయం 8 గంటల నుంచే కౌంటింగ్ ప్రారంభం కావడంతో పందెం రాయుళ్లు కూడా సిద్ధమయ్యారు. ముఖ్యంగా మేడ్చల్, చేవెళ్ల, మెదక్, సికింద్రాబాద్ లోక్‌సభ స్థానాలతోపాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై ఆసక్తి కనబరుస్తున్నారు. అభ్యర్థుల గెలుపోటములపై బేరీజు వేస్తూ పందేలు కాయడమే కాదు..ఎవరు ఎంత మెజారిటీతో గెలుస్తారు? సీటు, ఓటు శాతం, డిపాజిట్ల గల్లంతు, రాష్ట్రంలో ఏ పార్టీకి ఎన్ని లోక్‌సభ సీట్లు..ఇలా ప్రతి అంశాన్ని బెట్టింగ్‌కు వినియోగించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో బెట్టిం గ్ సమాచారంతో నగర పోలీసులు అప్రమత్తమయ్యారు.

# సొంత వైద్యం..మానేస్తే మేలు

**-ఇటీవల పెరుగుతున్న ప్రమాదకర ధోరణి -యాంటీబయాటిక్స్, దగ్గు, జలుబు, నొప్పి నివారణ మాత్రలతో ముప్పు**

**హైదరాబాద్, జూన్ 2 ప్రభాతవార్త**

అర్హులైన వైద్యుడిని సంప్రదించి, సరైన రీతిలో ఔషధాలను వాడడమే అన్ని విధాలా శ్రేయస్కరం. దీనిపై అవగాహన లేకపోవడంతో అత్యధికులు కొత్తగా అనారోగ్య సమస్యలను కొని తెచ్చుకుంటున్నారు. సాధారణ జలుబు, దగ్గు మొదలుకొని గొంతునొప్పి, జ్వరం, ఒళ్లు, మోకాళ్ల నొప్పులు, తలనొప్పి తదితరాలకు సొంతంగా ఔషధాలను వినియోగించే ప్రమాదరక ధోరణి ఇటీవల కాలంలో పెరిగిపోయింది. సామాజిక మాధ్యమాల కారణంగా ఆరోగ్యంపై కొంత అవగాహన పెరగడం, ఇంటర్నెట్‌లో అన్ని జబ్బులకూ ఔషధాల సమాచారం లభ్యమవడం, గతంలో ఇదే జబ్బుకు వైద్యుడు రాసిచ్చిన చీటీ అందుబాటులో ఉండడం, ప్రైవేటులో వైద్యుడి సంప్రదింపులు మరీ ఖరీదు కావడం.. ఇలా కారణాలేమైన సొంతంగా మందుల్ని కొనక్కోవడం మాత్రం ఎక్కువైంది. ఔషధ దుకాణాలు కూడా నిబంధనలు బేఖాతరు చేస్తూ..వైద్యుడి చీటీ లేకుండానే యథేచ్ఛగా మందులిచ్చేస్తున్నాయి. ఫలితంగా దీర్ఘకాలంలో రోగుల ప్రాణాల మీదకొస్తోంది. ఇలా సొంతంగా మందుల దీర్ఘకాలంలో రోగుల ప్రాణాల మీదకొస్తోంది. ఇలా సొంతంగా మందుల వాడకం వారి ఆరోగ్యంపై తీవ్ర దుష్ప్రభావం చూపుతుందని, మొత్తంగా ప్రజారోగ్యమే ప్రమాదంలో పడే అవకాశాలెక్కువగా ఉన్నాయని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆందోళన వ్యక్తం చేసింది. వైద్యుడి సలహాలు, సూచనలు లేకుండా ఎవరికివారే మందులు వాడితే కలిగే అనర్థాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరముందని పేర్కొంటూ... డైరెక్టర్ ఆఫ్ జనరల్ హెల్త్ సర్వీసెస్ విభాగం ఇటీవల అన్ని రాష్ట్రాలకు లేఖలు రాసింది.అన్ని రకాల మాధ్యమాల ద్వారా ప్రజల్లో ఈ అంశంపై చైతన్యం పెంపొందించాలని, ఇప్పటికే ఈ తరహాలో మందులు వాడుతున్న వారు.. ఈ ధోరణి నుంచి బయటపడాలనుకుంటే.. వైద్యారోగ్య శాఖ తరపున వారికి అవసరమైన సహకారం అందించాలని సూచించారు. ఈ లేఖలో పలు అంశాలను వివరంగా ప్రస్తావించారు.

**వ్యాధి నిర్ధారణలో జాప్యం..**

లక్షణాలు కనిపించగానే సొంతంగా మందులు వాడితే.. సమస్య తాత్కాలికంగా తగ్గినట్లు అనిపించినా.. కొన్నిసార్లు అసలైన వ్యాధిని గుర్తించడంలో ఆలస్యమై జబ్బు ముదురుతుంది. సరైన చికిత్స అందక వ్యాధి ముదిరి ప్రాణాంతక పరిస్థితులు ఏర్పడవచ్చు. కొన్ని రకాల దగ్గు మందు ద్రావణాలను మత్తు కోసం కూడా కొందరు వినియోగిస్తున్నారు. వైద్యుని చీటి లేకుండా ఎట్టి పరిస్థితుల్లోనూ విక్రయించకూడని దగ్గు మందును.. కొన్ని ఔషధ దుకాణాలు ఇష్టానుసారంగా విక్రయిస్తున్నాయి. అడపాదడపా చేసే తనిఖీలే తప్ప పటిష్ఠ నిఘా లేకపోవడం ఔషధ దుకాణాలకు వరంగా మారింది.

**ఔషధ దుష్ఫలితాలు..**

ప్రతి ఔషధానికి ఒక లక్ష్యమంటూ ఉంటుంది. ఏ జబ్బు కోసం ఎంత మోతాదులో వాడాలనేది చాలా ముఖ్యం. మయసు, బరువు, లక్షణాల తీవ్రతను బట్టి మోతాదుల్లో మార్పులు ఉంటాయి. అందుకే ఔషధాల డోసు తగ్గినా.. పెరిగినా దుష్ఫలితాలు తలెత్తుతాయి. డ్రగ్ రియాక్షన్ అయితే, జీవన్మరణ సమస్యలూ తలెత్తుతాయి.వైద్యుడి సలహాల్లేకుండా.. వేర్వేరు రకాల ఔషధాలను ఒకేసారి వేసుకునే సందర్భాల్లో కొన్నిసార్లు ప్రతికూలత ఎదురవుతుంది. ఎందుకంటే ఒకరికి పనిచేసిన ఔషదం అందరికీ పనిచేస్తుందని చెప్పలేం. వ్యక్తులు, జబ్బులకు కారణాలను బట్టి ఔషధాలు మారుతుంటాయి. వీటిని గ్రహించకుండా వినియోగిస్తే ప్రమాదమే. అలాంటప్పుడు ఆసుపత్రిలో చేరాల్సి రావచ్చు.నొప్పి నివారణ, నిద్రలేమి, అలర్జీలు తదితరాల నివారణ మందులను దీర్ఘకాలం వాడితే కొత్త అనర్థాలు ఏర్పడుతాయి. వాటిని వాడకపోతే రోజు గడవని బలహీనతను ఎదుర్కోవాల్సి వస్తుంది. మందు వాడితేనే నొప్పి తగ్గినట్టు అనిపిస్తుంది. గోళీ వేసుకుంటేనే నిద్ర వస్తుంది. లేకపోతే నిద్రలేని రాత్రుళ్లు గడపాల్సి వస్తుంది. దీర్ఘకాలంలో ఈ దుస్థితి ఆరోగ్యానికి చేటు చేస్తుంది.

**యాంటీ బయాటిక్స్ నిరోధకత..**

అవసరం లేకపోయినా యాంటీ బయాటిక్స్‌ను తరచూ వినియోగిస్తే శరీరంలో వాటికి నిరోధకత పెరుగుతుంది. భవిష్యత్తులో ఎప్పుడైనా బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్ బారినపడితే.. అప్పుడు యాంటీ బయాటిక్స్ వేసుకున్నా పనిచేయవు. ఫలితంగా ఇన్‌ఫెక్షన్ తీవ్రత పెరిగి తీవ్ర అనారోగ్యానికి దారితీసి, అవయవాల పనితీరును దెబ్బతీస్తుంది. ఉదాహరణకు జలుబు, దగ్గు, గొంతు ఇన్‌ఫెక్షన్‌కు యాంటీ బయాటిక్స్‌ను తరచూ వినియోగించడం, పూర్తిస్థాయి కోర్సు వాడకుండా.. లక్షణాలు తగ్గగానే మానేయడం వంటి చర్యలతో భవిష్యత్‌లో ఆ యాంటీ బయాటిక్స్ పనిచేయవు. నొప్పి నివారణ మాత్రలను తరచూ వాడితే మూత్రపిండాలు, కాలేయం దెబ్బతింటాయి. జీర్ణకోశంలో అల్సర్లు ఏర్పడి రక్తస్రావం జరుగుతుంది.

## రేసింగ్‌పై పోలీసుల ఉక్కుపాదం

**-అర్థరాత్రి ఐటి కారిడార్‌లో దాడులు**

**- 50 స్పోర్ట్స్ బైకులు స్వాధీనం**

**హైదరాబాద్, జూన్ 02, ప్రభాతవార్త:**

నగరంలో సువిశాలమైన ఐటీ కారిడార్ రహదారులు ఇటీవలె బైక్ రేసింగులకు అడ్డాలుగా మారుతున్నాయి. ట్రాఫిక్ రద్దీ లేని అర్థరాత్రి సమయాల్లో నిర్మానుష్యంగా మారే ఐటీ కారిడార్ రహదారుల మీద బైక్ రేసర్లు మితిమీరిన వేగంతో దూసుకొచ్చి ప్రమాదకరమైన స్టంట్లతో తోటి వాహనదారులను హడలగొడుతున్నారు. రేసుల కారణంగా ఐటీ కారిడార్ పరిధిలో పలు రోడ్డు ప్రమాదాలు సంభవిస్తుండడంతో, రేసర్ల ఆగడాలను నియంత్రించే చర్యలు చేపట్టేందుకు పోలీసులు రంగంలోకి దిగారు. సైబరాబాద్ కమీషనర్ అవినాష్ మహంతి ఆదేశాల మేరకు రేసింగులపై వారు ప్రత్యేక నిఘా పెట్టారు. అందులో భాగంగా పదుల సంఖ్యలో రేసులకు సిద్ధంగా ఉన్న స్పోర్ట్స్ బైకులను గుర్తించారు. మాదాపూర్ డీసీపీ వినీత్ ఆధ్వర్యంలో, రాయదుర్గం పోలీసు బృందాలు ఐటీకారిడార్‌లోని రేసింగులకు అడ్డాలుగా మారిన రహదారులను గుర్తించి శనివారం అర్థరాత్రి బైక్ రేసింగ్ స్పాట్లపై దాడులు చేశారు. ఐటీ కారిడార్ లోని టీహబ్, కోహినూర్, నాలెడ్జ్ పార్క్, సత్వా బిల్డింగ్, మైహోమ్ భుజా తదితర ప్రాంతాలలో రేసింగ్‌లకు సిద్ధంగా ఉంచిన 50 బైక్‌లను స్వాధీనం చేసుకుని, విచారణ నిమిత్తం రవాణా శాఖకు అప్పగించారు. ఇందులో పలు అధునాతన స్పోర్ట్స్ వాహనాలు ఉండడం విశేషం. బైక్ రేసర్లను అదుపులోకి తీసుకుని వారి మీద ఐపీసీ సెక్షన్ 336, 341, మోటార్ వెహికిల్ యాక్ట్ సెక్షన్ 154 కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ఉప్పల్ మినీ శిల్పారామంలో ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శనలు



మినీ శిల్పారామంలో కూచిపూడి నాట్య ప్రదర్శనలు ఇస్తున్న కళాకారులు

**ఉప్పల్, జూన్ 2 ప్రభాతవార్త :** ఉప్పల్ మినీ శిల్పారామంలో వారంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం పేరణి ఆంధ్ర నాట్యం, కూచిపూడి మసాలా కళాకారులు ప్రదర్శనలు నిర్వహించారు. వాగ్దేవి ఆర్ట్స్ అకాడమీ గురువు పవన్,సంధ్య ఆధ్వరయంలో పేరణి, ఆంధ్ర నాట్య అంశాలను కళాకారులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా వినాయక కౌతం, మెలప్రాప్తి, శబ్దపల్లవి, శృంగనర్తనం, కుంభ హారతి, జయజయోస్తు తెలంగాణ, తిల్లాన, మామవతు, శ్రీ సరస్వతి, హారతి అంశాలను కళాకారులు ప్రదర్శించారు. చంద్రశేఖర్ ఆధ్వర్యంలో శ్రీ సత్యసాయి నృత్య అకాడమీ శిష్యబృందం పుష్పాంజలి, బృందావనం నిలయేహ్, దశావతార శబ్దం, కొలువైతివారంగ సాయి, రామాయణ శబ్దం తదితర అంశాలను ప్రదృంచి మొప్పించారు. ఆదివారం సెలవు దినం కావడంతో సందర్శకుల నుంచి మంచి స్పందన ఉందని నిర్వహకులు తెలిపారు.

## ఘనంగా తెలంగాణ ఆవిర్భావ వేడుకలు



పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం



వేడుకలను నిర్వహిస్తున్న చంద్రశేఖర్, కోట్ల శ్రీనివాస్ తదితరులు



వేడుకలను నిర్వహిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి తదితరులు

**మలక్‌పేట, జూన్ 2 ప్రభాతవార్త :** తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మలక్‌పేట నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. మూసారాంబాగ్ శాలివాహననగర్‌లో టిపిసిసి ఎస్సీ విభాగం రాష్ట్ర కన్వీనర్ బోనగిరి చంద్రశేకర్, ముప్పిడి ధన్వంతల ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టిపిసిసి ప్రధాన కార్యదర్శి కోట్ల శ్రీనివాస్ విచ్చేసారు. ఉద్యమకారులు ఆర్.రాజేశ్వర్‌రెడ్డి, శాలివాహననగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చల్లూరి రఘునందన్‌రెడ్డి, కార్యదర్శి అనిల్‌కుమార్, మహ్మద్ ఖమర్, రామచందర్, కిరణ్, చిట్టు పాక ప్రభాకర్, యుపిఎస్‌సి మెడికల్ అధికారి తరుణ్, బోనగిరి మధుమోహన్, రాజు, నాగరాజు, నరేందర్, నాగరాజు, కీసర శివకుమార్, పున్‌రెడ్డి తదితరులు ఘనంగా సన్మానించి అభినందనతు తెలిపారు.



వేడుకల్లో పాల్గొన్న మలక్‌పేట కాంగ్రెస్ ఇంఛార్జి షేక్ అక్బర్ తదితరులు



స్థూపం వద్ద నివాళుల ర్పించిన అజిత్‌రెడ్డి, రఘునందన్‌రెడ్డి

**కార్పొరేటర్ భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో...** శాలివాహననగర్ పార్కులో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా కృష్ణ తులసినగర్ కమ్యూనిటీ హాల్ వద్ద తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నరసింహారెడ్డి, రగునందన్‌రెడ్డి, ప్రసాద్, జక్కా మోహన్‌రెడ్డి, పున్‌రెడ్డి కృష్ణారెడ్డి, కమలాకర్, యాదయ్య, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

**అజిత్‌రెడ్డి ఆధ్వర్యంలో...** మలక్‌పేట నియోజకవర్గ బిఆర్ఎస్ ఇంచార్జి తీగల అజిత్‌రెడ్డి ఆధ్వర్యంలో మూసారాంబాగ్‌నుండి నాయకులు, కార్యకర్తలతో కలిసి అమరవీరుల స్థూపంవద్ద ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో చల్లూరి రఘునందన్‌రెడ్డి, పవన్, అభిషేకం తదితరులు పాల్గొన్నారు.

**పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో...** తెలంగాణ రాష్ట్ర పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.భరత్‌రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించి, ప్రొఫెసర్ జయశంకర్, అమరవీరులు, గాంధీ, అంబేద్కర్ చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు చోళ ఓంప్రకాష్‌యాదవ్, మదన్ మోహన్‌రావు, ఎం.కృష్ణమూర్తి, ఖాజా షబ్బీర్ అహ్మద్, వాసుదేవరావు, యాదగిరిరెడ్డి వీరయ్య తదితరులు పాల్గొన్నారు.



పెద్దఅంబర్‌పేటలో జెండా ఆవిష్కరణలో చైర్‌పర్సన్, కమిషనర్ తదితరులు



హయత్‌నగర్‌లో జెండా పండుగలో కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

**హయత్‌నగర్, జూన్ 2 ప్రభాతవార్త:** తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ కేంద్రంతో పాటు ఆయా వార్డులలో మువన్నెల జెండాను ఎగురవేశారు. మున్సిపాలిటీ కార్యాలయంలో జెండా ఆవిష్కరణలో చైర్‌పర్సన్ చెవుల స్వప్న, వైస్‌చైర్‌పర్సన్ చామ సంపూర్ణారెడ్డి, కమిషనర్ రవీందర్‌రెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు. తట్టిఅన్నారం వార్డు కార్యాలయంలో కౌన్సిలర్ దేవిడిగీతవేణుగోపాల్‌రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. హయత్‌నగర్‌లోని సీపీఐ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవీంద్రాచారి మువ్వన్నెల జెండాను ఎగురవేశారు. హయత్‌నగర్‌లోని వార్డు కార్యాలయంలో కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధి లెక్చరర్స్ కాలనీలో నిర్వహించిన జెండా పండుగలో కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి పాల్గొని జెండాను ఆవిష్కరించారు.

## అంబరాన్నింటిన తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ధి వేడుకల సంబరాలు



అమర వీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న సబితారెడ్డి తదితరులు



చీరలు పంపిణీ చేస్తున్న కెఎల్ఆర్, సామిడి గోపాల్‌రెడ్డి



తెలంగాణ తల్లికి పుష్పాభిషేకం చేస్తున్న అందెల శ్రీరాములుయాదవ్ తదితరులు



సోనియా గాంధీకి పాలాభిషేకం చేస్తున్న పారిజాత తదితరులు



మీర్‌పేట్‌లో జెండా ఆవిష్కరణ చేసిన మేయర్ దుర్గ దీప్‌లాల్ తదితరులు

**సరూర్‌నగర్, జూన్ 2 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలోని మీర్‌పేట్, బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లలో ఆదివారం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ధి ఉత్సవాల సంబరాలు ఘనంగా జరిగాయి. రాజకీయాలకతీతంగా అన్ని పార్టీల వారు ఈ వేడుకలను నిర్వహించారు. కార్పొరేషన్ కార్యాయాలు, ప్రధాన చౌరస్తాలలో జాతీయ పతాకాలు రెపరెపలాడాయి.

**అమరులకు నివాళులర్పించిన సబితమ్మ...** రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది వేడుకల సందర్భంగా మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడ సంద చెరువు కట్టపై నున్న అమరవీరుల స్థూపం వద్ద ఆమె బిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో కలిసి తెలంగాణ ఉద్యమంలో అసువులు బాసిన అమర వీరులకు ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి నివాళులర్పించారు. అనంతరం బాలాపూర్ చౌరస్తాలో ఆచార్య జయశంకర్ విగ్రహానికి నివాళులర్పించిన తర్వాత జిల్లెలగూడ ఆర్‌సిఐ రోడ్డులోని తన క్యాంపు కార్యాలయంపై ఆమె జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాల్లో మేయర్ ముదావత్ దుర్గ దీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, బిఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, పార్టీ అధ్యక్షుడు అర్కల కామేష్‌రెడ్డి, పలువురు కార్పొరేటర్లు, నాయకులు అనుబంధ విభాగాల శ్రేణులు పాల్గొన్నారు.

**చీరలు పంపిణీ చేసిన కెఎల్ఆర్...** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా మీర్‌పేట్ కార్పొరేషన్‌లో టిపిసిసి రాష్ట్ర ప్రచార కమిటీ కార్యవర్గ సభ్యుడు సామిడి గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి జాతీయ పతకాన్ని ఆవిష్కరించి సోనియా గాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేసి పేద మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, దేప భాస్కర్‌రెడ్డి, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రవికాంత్, కార్యదర్శి సామిడి చరణ్‌రెడ్డి, ఐఎన్‌టియుసి అధ్యక్షుడు సామ భాస్కర్‌రెడ్డి, ఎన్ఎస్‌యుఐ దీక్షిత్, పద్మ తదితరులు పాల్గొన్నారు.

**తెలంగాణ తల్లికి పుష్పాభిషేకం చేసిన అందెల...** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది వేడుకలను పురస్కరించుకొని మహేశ్వరం నియోజకవర్గ బిజెపి ఇంఛార్జి అందెల శ్రీరాములు యాదవ్ బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని బాలాజీనగర్ కాలనీ కూడలిలోనున్న తెలంగాణ తల్లి విగ్రహానికి పుష్పాభిషేకం అమర వీరుల త్యాగాలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి, నడికుడ యాదగిరి, రాళ్ళగూడెం రామకృష్ణారెడ్డి, చిత్రం శ్రీనివాస్, పోరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, నిమ్మల శ్రీకాంత్‌గౌడ్, మంత్రి మహేష్ ముదిరాజ్, తోట ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**జెండా ఎగురవేసిన యెల్మేటి...** దశాబ్ది ఉత్సవాల సందర్భంగా జల్‌పల్లి మున్సిపాలిటీ కొత్తపేటలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ పిసిసి కార్యదర్శి యెల్మేటి అమరేందర్‌రెడ్డి మైనారిటీ నాయకులతో కలిసి జాతీయ జెండా ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో అహ్మద్ బామ్, అబూబిన్ అలీ, హలీం, అన్సార్, ఫైజల్ బామ్‌లతో పాటు సదానంద్‌గౌడ్, సంతోష్‌సింగ్, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**కార్పొరేషన్ కార్యాలయాల్లో జెండాలు ఎగురవేసిన మేయర్లు**
బడంగ్‌పేట్, మీర్‌పేట్ కార్పొరేషన్ కార్యాలయాల వద్ద మేయర్లు చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, ముదావత్ దుర్గ దీప్‌లాల్ చౌహాన్‌లు జాతీయ జెండాలను ఎగురవేశారు. ఈ కార్యక్రమాల్లో కమీషనర్లు రఘు, చంద్రశేఖర్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, పలువురు కార్పొరేటర్లు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**భాగ్యనగర్ సొసైటీలో ఘనంగా వేడుకలు...** రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది వేడుకల సందర్భంగా నాదర్‌గుల్‌లోని భాగ్యనగర్ సొసైటీ వద్ద ఛైర్మన్ మర్రి నర్సింహారెడ్డి జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ బంగారు బాబు, మాజీ ఛైర్మన్ పెత్తుల్ల పుల్లారెడ్డి, డైరెక్టర్లు యెల్చల సుదర్శన్‌రెడ్డి, పెద్దబావి మోహన్‌రెడ్డి, కందాడి జ్యోతి, మేనేజర్ పిండి నారాయణరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర అవిర్బావ దశాబ్ది వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



కెసిఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

**ఉప్పల్, జూన్ 2 ప్రభాతవార్త :** తెలంగాణ భవన్‌లో తెలంగాణ రాష్ట్ర అవిర్భావ దశాబ్ది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ అధినేత, మాజీ సిఎం కెసిఆర్‌ను పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ కృషి ఎంతో ఉందన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి అమరులకు శ్రద్దాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ముగిసిన ఆర్ 3 బ్యాడ్మింటన్ వేడుకలు



సర్టిఫికెట్ అందజేస్తున్న ఉప్పలశ్రీనివాస్‌గుప్తా

**హైదరాబాద్, జూన్ 2 ప్రభాతవార్త :** ఆర్3 బ్యాడ్మింటన్ స్టేడియం నాగోల్‌లో యూనిక్స్ సన్‌రైస్ రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ ముగింపు వేడుకల్లో ముఖ్యఅతిథిగా టిపిసిసి ప్రచార కమిటీ రాష్ట్ర కో-కన్వీనర్, బ్యాడ్మింటన్ అసోసియేషన్ రంగారెడ్డి జిల్లా వైస్ చైర్మన్ ఉప్పల్ శ్రీనివాస్ గుప్త హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానసిక ఉల్లాసానికి క్రీడలు అవసరమని ఇలాంటి క్రీడ నిర్వహిస్తున్న నిర్వాహులకు ఆయన కృతజ్ఞతలు తెలిపి భవిష్యత్తులో క్రీడాకారులకు అండగా ఉంటానని తెలిపారు. బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో 693 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. మెన్స్ సింగిల్స్ విజేతలు ప్రణవ్, సమల మెన్స్ డబుల్ విజేతలు ప్రణవ్ వల్లతురు, ప్రణవ్ సమల అలాగే ఉమెన్స్ సింగిల్స్ యశ్వమాలిక్ ఉమెన్స్ డబుల్స్ దారా రుచిష్య రెడ్డి తదితర విజేతలకు బహుమతులను ఉప్పల అందజేశారు. 13 సంవత్సరాలనుండి 75 సంవత్సరాల వరకు బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ శ్రీనివాసరావు, ట్రెజరర్ బాబు, సాయిరెడ్డి, ఆనంద్, సామ ప్రభాకర్‌రెడ్డి, కుమార్ బ్యాడ్మింటన్ క్రీడాకారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## సర్కిల్-5 అధికారుల అవినీతిపై విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలి



మీడియాతో మాట్లాడుతున్న బాధితుడు నర్సింగ్‌రావు, న్యాయవాది రాపోలు భాస్కర్

**సైదాబాద్, జూన్ 2 ప్రభాతవార్త:** అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తూ అవినీతికి పాల్పడుతున్న సర్కిల్ 5 సరూర్‌నగర్ అధికారులపై విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని బాధితుడు జలింగం నర్సింగరావు కోరారు. కళ్యాణ్‌నగర్‌లో హైకోర్టు న్యాయవాది రాపోలు భాస్కర్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడుతూ పి అండ్ టి కాలనీ కోదండ రాంనగర్‌లో తన తండ్రి జలిగం కృష్ణ నుంచి వారసత్వంగా వచ్చిన ఉమ్మడి ఆస్తిని తనకు తెలియకుండానే తన సోదరుడి భార్య విక్రయించడం జరిగిందన్నారు. దీంతో తాను న్యాయస్థానాన్ని ఆశ్రయించగా అందులో ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని కోర్టు ఉత్తర్వులు ఇవ్వడం జరిగిందన్నారు. కోర్టులో కేసు నడుస్తున్న ఈ స్థలంలో ఎలాంటి అనుమతులు ఇవ్వవద్దని తాను జిహెచ్ఎంసి అధికారులకు లిఖిత పూర్వకంగా దరఖాస్తు చేయడం జరిగిందన్నారు. అయితే అధికారులు మాత్రం ఇవేమి పట్టించుకోకుండా కేవలం లంచానికి ఆశపడి జి ప్లస్ 2 నిర్మాణానికి అనుమతిని మంజూరు చేయడం జరిగిందన్నారు. జి ప్లస్ 2 అనుమతి తీసుకున్న నాగేశ్వర్‌రావు అధికారుల అండతో అక్రమంగా జి ప్లస్ 5 నిర్మాణాన్ని చేపట్టడం జరిగిందన్నారు. దీని గురించి టౌన్ ప్లానింగ్ ఎసిపి, డిసిపి, డిసిలకు అనేక సార్లు ఫిర్యాదు చేసినప్పటికి ఫలితం దక్కలేదని ఆయన వాపోయారు. కోర్టు ఉత్తర్వులకు వ్యతిరేకంగా ఉమ్మడి ఆస్తిలో నిర్మాణానికి అనుమతులు మంజూరు చేసిన అధికారుల అవినీతిఅక్రమాలపై విచారణచేసి, చర్యలుతీసుకుని తనకు తగిన న్యాయం చేయాలని ఆయన కోరారు. న్యాయవాది రాపోలు భాస్కర్ మాట్లాడుతూ అక్రమాలకు పాల్పడుతున్న సర్కిల్ 5 జిహెచ్ఎంసి అధికారులపై అవినీతి నిరోధక శాఖ, డిజిపి, ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు.

## సాయికుటీర్ నూతన కార్యవర్గం ఎన్నిక

**హయత్‌నగర్, జూన్ 2 ప్రభాతవార్త:** పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ 9వ వార్డుపరిధిలోని శ్రీసాయి కుటీర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికయ్యింది. నూతన అధ్యక్షుడిగా నక్క సంజీవ్‌కుమార్‌గౌడ్, ఉపాధ్యక్షుడిగా పి.రాజేంద్రన్, ప్రధాన కార్యదర్శిగా సంతోష్, సంయుక్త కార్యదర్శిగా జోతిర్మయి, కోశాధికారిగా కె.పద్మ, కార్యవర్గ సభ్యులుగా బి.భాస్కర్, టి.రవికుమార్‌లు ఎన్నికయ్యారు. రెండేళ్ల పాటు కార్యవర్గం కొనసాగుతుంది. ఆదివారం ఉదయం కాలనీ కమ్యూనిటీ హాలులో నిర్వహించిన కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకరణ చేశారు. నూతన కార్యవర్గానికి మాజీ అధ్యక్షుడు ఎన్నెపల్లి మధుసూదన్‌రెడ్డి అసోసియేషన్ సంబంధిత దస్త్రాలను అందించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు సంజీవ్ మాట్లాడుతూ... కౌన్సిలర్ మురళీధర్‌రెడ్డి, కార్యవర్గం, అసోసియేషన్ సభ్యుల సహకారంతో కాలనీ అభివృద్ధికి కృషిచేస్తానని తెలిపారు.

## ఘనంగా తెలంగాణ అవతరణ ఉత్సవాలు



జాతీయ జెండాను ఎగురవేస్తున్న కొత్త కుర్మా సత్తయ్య తదితరులు



జాతీయ జెండాకు అభివాదం చేస్తున్న హరితధన్‌రాజ్‌గౌడ్ తదితరులు



జాతీయ జెండాకు ఎగురవేసిన శ్రీలత అనిల్‌కుమార్ తదితరులు

**తుర్కయాంజాల్,జూన్ 2 ప్రభాతవార్త :** తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ దశాబ్ది వేడుకల్లో సందర్భంగా తుర్కయంజాల్ రైతు సేవా సహకార బ్యాంకులో డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు వంగే టి లక్ష్మారెడ్డి, సంఘ వైస్ చైర్మన్ కొత్త రాంరెడ్డి, డైరెక్టర్లు సామ సంజీవరెడ్డి, చాపల యాదగిరి, శీలం లక్ష్మమ్మ, జక్క కృష్ణారెడ్డి, సామ సత్యనారాయణ రెడ్డి, సంఘ సెక్రటరీ వై. రాందాస్, పాల్గొన్నారు.

**ఇంజాపూర్ వార్డు కార్యాలయంలో...** తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా తుర్కయంజాల్ మున్సిపాలిటీ ఇంజాపూర్ వార్డు కార్యాలయంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ గుండ్లపల్లి హరిత ధనరాజ్‌గౌడ్ జాతీయ పతాక ఆవిష్కరణ చేసారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లెల రవిశేఖర్, బత్తుల శంకర్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, నర్సింహారెడ్డి, కాటమయ్యగౌడ్, మహమ్మద్ గౌస్‌పాషా, కృష్ణగౌడ్, నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**ఉమార్‌ఖాన్‌గూడలో...** తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉమార్‌ఖాన్‌గూడ ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కౌన్సిలర్ ఫ్లోర్ లీడర్ కరాడి శ్రీలతఅనిల్‌కుమార్ హాజరై జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నల్ల బాల్‌రెడ్డి, తూల శంకరయ్య గౌడ్, లక్ష్మారెడ్డి, తుల సుధాకర్‌గౌడ్, బండారు దానయ్య, కాలే శ్రీహరి, పండుగల రామ్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అమరుల త్యాగంతోనే తెలంగాణ రాష్ట్రం



జెండాకు అభివాదం చేస్తున్న మల్‌రెడ్డి రామ్‌రెడ్డి తదితరులు

**హైదరాబాద్, జూన్ 2 ప్రభాతవార్త :** వేలాదిమంది అమరవీరుల త్యాగఫలంతోనే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని రాష్ట్ర రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రామ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా చైతన్యపురిలోని శివాజీ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మల్‌రెడ్డి రాంరెడ్డి, ఎల్బీ నగర్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రాంరెడ్డి మాట్లాడుతూ నాలుగు కోట్ల ప్రజల ఉద్యమ గళం, అమరుల త్యాగఫలితం, కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియాగాంధీ చొరవ వల్లే రాష్ట్రం సాధ్యమైందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే 5 గ్యారంటీలను అమలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్డి జేఏసీ రాష్ట్ర కన్వీనర్ బద్దూరి వెంకటేశ్వర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు బండ సురేందర్ రెడ్డి, మంజుల రెడ్డి, గుర్రం శ్యామ్ చరణ్ రెడ్డి, పన్యాల జైపాల్ రెడ్డి, జ్యోతి, శరత్ కుమార్ రెడ్డి, తిరుమల రెడ్డి, రవికేశవ్ నాయుడు, యాదవ రెడ్డి, కిరణ్ రెడ్డి, నరేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వాడవాడలా తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు



జెండా అవిష్కరణలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నేతలు



జెండా అవిష్కరణ చేస్తున్న బిజెపి నేతలు గోనె శ్రీకాంత్, బాలచందర్



సర్కిల్ కార్యాలయంలో జెండా అవిష్కరిస్తున్న డిసి అంజనేయులు తదితరులు

**ఉప్పల్, జూన్ 2 ప్రభాతవార్త :** ఉప్పల్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాలలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఉప్పల్‌లోని పలు ప్రభుత్వ కార్యాలయాలతోపాటు, పార్టీ ఆఫీసులు, చౌరస్తాలవద్ద పలువురు నేతలు, అధికారులు జాతీయ జెండాలు అవిష్కరించారు. ఉప్పల్ మున్సిపల్ కార్యాలయం వద్ద డిప్యూటి కమిషనర్ అంజనేయులు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొని జెండా అవిష్కరించారు. రెవెన్యూ కార్యాలయం వద్ద తహసీల్దార్ వాణిరెడ్డి, పోలీస్‌స్టేషన్‌పై సిఐ ఎలక్షన్‌రెడ్డి తదితరులు జాతీయ జెండాలను అవిష్కరించారు. ఉప్పల్‌లో ఇందిరాగాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మందముల్ల పరమేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు దుబ్బ నరసింహారెడ్డి జెండా అవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోనియా దయతోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుయ్యిందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు కంది ఆగిరెడ్డి, సుర్వి మురళీగౌడ్, లుకాస్, సుధాకర్‌రెడ్డి, బజారు జగన్‌గౌడ్, తెల్కల మోహన్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, ఆగంరెడ్డి, జలీల్‌పాషా, రాజేష్, బాకారం లక్ష్మణ్, రఫీక్, శ్రీకాంత్‌గౌడ్, విజయ్, చరణ్, దేవిరెడ్డి, రామకృష్ణ, కౌశిక్, అమరేశ్వరి, సురేష్, గరిక సుధాకర్, సత్యం, శ్రీరాములు, జంగయ్య, ప్రభాకర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, మురళీకృష్ణారెడ్డి, అస్లాం తదితరులు పాల్గొన్నారు.

**బిజెపి ఆధ్వర్యంలో...** ఉప్పల్ సర్కిల్ చిలుకానగర్ బిజెపి డివిజన్ గోనె శ్రీకాంత్ ముదిరాజ్ ఆధ్వర్యంలో చిలుకానగర్ చౌరస్తాలో జాతీయ జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా బిజెపి అసెంబ్లీ కన్వీనర్ దేవసాని బాలచందర్, సీనియర్ నేతలు గోనె అంజయ్య, తెలంగాణ సంపత్, సుధాకర్,పలుగుల యాదగిరి, పాల్వంచ విఠల్, సంఘిస్వామియాదవ్, చంద్రయ్య, పుప్పాల వెంకటేశ్వర్లు, తిరుపతి, నరసింహులు, సత్యనారాయణ, కృష్ణానాయక్, నరేందర్, చోటేమియా, రామకృష్ణగౌడ్, పురుషోత్తంరెడ్డి, దుర్గా కృష్ణ, తదితరులు పాల్గొన్నారు. ప్రత్యేక తెలంగాణ కోసం బలిదానం చేసిన అమరుల సేవలు మరువలేనివన్నారు.



జాతీయ పతాకాన్ని ఎగురవేస్తున్న కార్పొరేటర్ శ్వేత మధుకర్‌రెడ్డి



స్వీట్లు పంపిణీ చేస్తున్న మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి స్వర్ణలత

**సైదాబాద్, జూన్ 2 ప్రభాతవార్త:** తెలంగాణా ఆవిర్భావ దినోత్సవాన్ని వాడవాడలా ఘనంగా నిర్వహించారు. ఐఎస్ సదన్ డివిజన్‌లో శివాజీ చౌక్ వద్ద నిర్వహించిన వేడుకలకు కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జండాను ఎగుర వేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి అధికారప్రతినిధి వీరేందర్‌బాబు, నాయకులు మన్నె శ్రీను, రేణుక ముదిరాజ్, గిరిధర్‌రెడ్డి, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా సైదాబాద్‌లో మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి స్వర్ణలత ఆధ్వర్యంలో తెలంగాణా ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జాతీయ ఈ కార్యక్రమంలో డివిజన్‌బిఆర్ఎస్ అధ్యక్షుడు పగిళ్ల శ్రీనివాస్ రెడ్డి, లక్ష్మణ్ ఠాగూర్, సుభాష్, వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు. సైదాబాద్ డివిజన్ శంకేశ్వర్ బజార్‌లో జరిగిన వేడుకల్లో నగర మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్ చందర్జీ, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లింగాల హరిగౌడ్‌లు పాల్గొన్నారు. లింగోజిగూడ డివిజన్ లిబర్టీ చౌరాస్త వద్ద జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి జాతీయ జండాను ఎగుర వేశారు. ఈ కార్యక్రమంలో ఉప్పల శ్రవణ్ కుమార్ గుప్తా, నర్రె శ్రీనివాస్, ప్రవీణ్ కుమార్, ప్రవీణ్‌రెడ్డి, శ్రీధర్‌గౌడ్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.